గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9 వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ సమన్వయ అధికారి జాక్వెలిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వెబ్‌సైట్ https://mahabubabad. telangana. gov. inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 95428 72789లను సంప్రదించాలన్నారు.



పత్తి రైతుపై సీసీఐ కత్తి!

నిబంధనల పేరుతో తీవ్రమైన ఆంక్షలు

- చుక్కలు చూపిస్తున్న కపాస్ యాప్
- తేమ శాతం పేరుతో మద్దతు ధరలో కోత
- 7క్వింటాళ్ల కొనుగోళ్ల నిబంధనతో పరేషాన్
- అంతర్ జిల్లా పత్తి అమ్మకాలపై ఆంక్షలు
- జిన్నింగ్ మిల్లుల కేటాయింపుల్లో గందరగోళం
- ఒకే ధర ఉన్నా.. 3 రకాలుగా మిల్లుల వర్గీకరణ
- సీసీఐ నిబంధనలతో ఆవేదన చెందుతున్న రైతు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పత్తి రైతుకు సీసీఐ నిబంధనలు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రకృతి విపత్తులను ఎదుర్కొని కాపాడుకున్న పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. తేమ నిబంధనతో మద్దతు ధరను కోల్పోతున్న రైతులు.. కపాస్ యాప్‌తో మరిన్ని కష్టాలను ఎదుర్కొంటున్నారు. పత్తి సాగు వివరాల నమోదుతో పాటు సీసీఐ కొత్తగా ఏడు క్వింటాల్ నిబంధనను తెరపైకి తెచ్చింది. రైతులు పండించిన పత్తిని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని షరతు పెట్టింది. దీంతో సరిహద్దు జిల్లాల్లోని రైతులకు సమస్యగా మారింది. అన్ని జిన్నింగ్ మిల్లులకు బేల్‌కు ఒకే ధర చెల్లిస్తూ.. ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ప్రవేశ పెట్టడంపై జిన్నింగ్ మిల్లర్లు సీసీఐపై మండిపడుతున్నారు. పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తామని హెచ్చరికలకు దిగుతున్నారు. సీసీఐ నింబంధనల తీరు రైతుల పంట విక్రయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అరుగాలం శ్రమించిన పంటను మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే హక్కు కూడా లేదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

విపత్తులో సీసీఐ నిబంధనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ సీజన్‌లో 5,14,904 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా, 4,11,923 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అష్టకష్టాలు పడి పత్తిని కాపాడుకున్న రైతులపై అక్టోబరు చివరలో వచ్చిన తుఫాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పత్తి తీసేందుకు రైతులు సన్నద్ధమవుతున్న క్రమంలో వచ్చిన తుఫాన్ రైతులకు కన్నీళ్లను మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తును సైతం కొందరు రైతులు నిలదొక్కుకుని మిగిలిన పత్తిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో సవాలక్ష సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా సీసీఐ పూటకో నిబంధనను తీసుకువచ్చి రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. 8 నుంచి 12శాతం కంటే తేమ మించితే మద్దతు ధర ఇవ్వటం లేదు. ప్రస్తుతం తుఫాన్‌తో (మిగతా 7లో..)

ఎకరాకు ఏడు క్వింటాళ్లేనట..

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కపాస్ యాప్ కూడా రైతులకు చుక్కలు చూపిస్తోంది. వ్యవసాయ అధికారులు ముందస్తుగా రైతులకు ఈ యాప్‌పై అవగాహన కల్పించలేదు. దీంతో నేరుగా స్మార్ట్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని, పంట వివరాలను నమోదు చేయడం ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్య నుంచి బయటపడే లోపే మొన్నటివరకు ఎకరాకు 12 క్వింటాళ్ల కొనుగోలు చేసే నిబంధనకు సీసీఐ ఆంక్షలు విధించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా దిగుబడి తగ్గిందనే సాకుతో ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతులు విక్రయించుకునే విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కౌలు రైతులు, పట్టాబుక్‌లు లేని రైతులు సీసీఐకి పత్తిని అమ్ముకోవటంలో సమస్యలు ఎదురవుతున్నాయి.

అంతర్ జిల్లా పత్తి విక్రయాలపై ఆంక్షలు

రైతులపై సీసీఐ మరో నిబంధన బాంబు పేల్చింది. గతంలో రైతులు తమ పంటలను విక్రయించుకునేవారు. అయితే సీసీఐ కొత్త నిబంధన ప్రకారం రైతులు తమ ఉమ్మడి జిల్లా పరిధిలోనే పత్తి పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. ఆ విధంగా కపాస్ యాప్‌లో నిబంధనలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు పక్కనే ఉన్న కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో పత్తిని అమ్ముకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరిహద్దులో ఉన్న మండలాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు ఏటా పత్తిని 25కిలో మీటర్ల దూరంలో ఉన్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తారు. సీసీఐ కొత్త నిబంధనతో ఈసారి జమ్మికుంటలో మొగుళ్లపల్లి రైతులు పత్తిని విక్రయించే అవకాశం లేకుండా పోతోంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి కూడా పత్తి అమ్మకానికి వస్తుంది. కొత్త నిబంధన రైతులకు శాపంగా మారిందనే విమర్శలున్నాయి. అలాగే సీసీఐ చర్యలతో పత్తి కొనుగోళ్లపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖమ్మం జిల్లాలో 7లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 8జిన్నింగ్ మిల్లులే ఉన్నాయి. వరంగల్‌లో 10లక్షల బేల్ సామర్థ్యం ఉన్న 56 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఖమ్మంలో జిన్నింగ్ మిల్లులు ఫుల్ అయితే సీసీఐ కొనుగోళ్లపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని జిన్నింగ్ మిల్లర్లు పేర్కొంటున్నారు. అంతర్ జిల్లాల్లో పత్తి అమ్మకాలపై సీసీఐ అంక్షల పెట్టడంపై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని.. అరుగాలం శ్రమించి సాగు చేసిన పత్తిని తమకు నచ్చిన చోట అమ్ముకునే స్వేచ్ఛ లేకుండా పోతోందని అన్నదాతలు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీసీఐ నిబంధనలపై దృష్టి పెట్టి రైతులపై భారం పడకుండా స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నూతన క్వారీలకు

అనుమతి తప్పనిసరి

జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మైనింగ్ క్వారీ లీజులు, రెన్యూవల్, నూతన క్వారీల మంజూరు కోసం రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రభావ అధ్యయన సంస్థ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని జిల్లా మైనింగ్ అధికారి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు, కలెక్టర్ సూచనల మేరకు డ్రాఫ్ట్ జిల్లా సర్వే నివేదికను పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రూపొందించామన్నారు. ఈ నివేదికను ప్రజాభిప్రాయం కోసం జిల్లావెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.

ఈ సర్వే నివేదికపై ప్రజల అభిప్రాయాలను 21 రోజుల్లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మైనింగ్ కార్యాలయానికి పంపాలని సూచించారు.

12న యువజన కళాకారుల ఎంపిక

- జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 12న జిల్లాస్థాయి యువజన కళాకారుల ఎంపిక ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15సంవత్సరముల నుంచి 29 ఏళ్లలోపు వయసు ఉన్న అభ్యర్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన కళాకారులను 2026 జనవరి 12న న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. జానపద పాటల గ్రూపు, కథారచన (హిందీ, ఇంగ్లీష్, తెలుగు), పెయింటింగ్, ఉపన్యాస (హిందీ, ఇంగ్లీష్), కవిత్వం(హిందీ, ఇంగ్లీష్, తెలుగు), ఇన్నోవేషన్ ట్రాక్ విభాగాల్లో ఎంపికలుంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు జిల్లా యువజన క్రీడల కార్యాలయం, లేదా వాట్సాప్ నెంబర్: 94406 30681లో గాని పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

నిద్రలో నిఘా నేత్రాలు

మానుకోట ఆర్టీసీ బస్టాండ్‌లో పని చేయని కెమెరాలు

- ప్రయాణికుల వస్తువులకు కరువైన రక్షణ
- వరుస దొంగతనాలతో భయాందోళనలో జనం
- ఉపయోగంలోకి తీసుకురావాలని డిమాండ్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయక నిరుపయోగంగా మారాయి. ప్రతీ రోజు వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తుంటారు. ఉదయం నుంచి మొదలుకుని రాత్రి వరకు ఆ ప్రాంగణం ప్రయాణికులతో రద్దీగా కిటకిటలాడుతూ ఉంటుంది. అలాంటి ప్రదేశంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఇటీవల కాలంలో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అందులో కొన్ని పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో అవి వెలుగులోకి రావడం లేదు. తాజాగా గురువారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళకు సంబంధించి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో ఇటీవల జరిగిన దొంగతనాలపై ప్రయాణికులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రత కరువైందని భయాందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి, పోలీస్ నిఘాను పెంచి దొంగతనాలను నివారించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు

చోరీలతో ప్రయాణికుల బెంబేలు..

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఇటీవల కొంత కాలంగా వరుస చోరీలు జరుగుతోండడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. కొంత మందివి సెల్‌ఫోన్‌లు చోరీకి గురికాగా, మరికొందరివి డబ్బులు పోయాయి. అయినా ఆయా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో అవి వెలుగు చూడలేదు. తాజాగా గురువారం రాత్రిభద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మహిళా తన పిల్లలతో కలిసి వరంగల్ జిల్లా ఖానపురం మండలం బుధరావుపేటలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు మానుకోట నుంచి నర్సంపేటకు బస్సులో బయలు దేరారు. కొద్ది దూరం వెళ్లాక టిక్కెట్ తీసుకునేందుకు హ్యాండ్ బ్యాగులో ఉన్న ఆధార్ కార్డును చూపించేందుకు ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా, అప్పటికే బ్యాగు ఓపెన్ చేసి ఉంది. తీరా చూసే సరికి అందులో ఉన్న సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు కన్పించలేదు. దీంతో అవి అపహరణకు గురయ్యాయని భావించిన మహిళ వెంటనే మానుకోట టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై శివ, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిసరాలను, క్యాంటిన్‌లో సీసీ పుటేజీలను పరిశీలించారు.

ప్రయాణికులతో కిటకిట..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం నిత్యం వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. మానుకోట డిపో నుంచి (మిగతా 8లో..)



మహబూబాబాద్‌లో ఆర్టీసీ బస్టాండ్‌లో నిరుపయోగం ఉన్న సీసీ కెమెరా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తేనే భద్రత

రోజూ వేలాది మంది కిటకిటలాడే మానుకోట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణలో గత కొన్ని సంవత్సరాల క్రితం నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో కొద్ది కాలం అవి బాగానే పని చేశాయి. వాటికి ఏమైందో ఏమో కానీ, ఆ సీసీ కెమెరాలు ప్రస్తుతం పని చేయకుండా నిరుపయోగంగా మారిపోయాయి. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా కరువై దొంగతనాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ఆభరణాలకు రక్షణ కరువైంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాలను ఉపయోగంలోకి తీసుకురావా లని ప్రయాణికులు కోరుతున్నారు. పోలీలు నిఘాను పెంచి దొంగతనాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సూరి గ్యాంగ్ వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితో పాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ నిందితులు
- రెండు పిస్టళ్లు, కత్తి, బుల్లెట్ స్వాధీనం
- శాయంపేట పీఎస్‌లో రెండు కేసులు నమోదు
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి

7

దోపిడీ ఉన్నంత వరకు ప్రజా ఉద్యమాలు తప్పవు

- అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు



గోపాలపురంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వరరావు

గార్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో దోపిడీ పాలన ఉన్నంత వరకు ప్రజాఉద్యమాలు తప్పవని సీపీఐ(ఎంఎల్)-న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోపాలపురంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం.. ఈ దేశ ప్రజల విముక్తి కోసం ఆయుధాలను చేతపట్టి సాయుధంగా ముందుకునడిచి శత్రువు తూటాలకు అమరులైన కార్మికుల ఆశయాలను నేటితరం కార్యకర్తలు ముందుకు తీసుకపోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు గ్రామాల్లో పేదలను సమీకరించి ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో బండారి ఐలయ్య, జిల్లా నాయకులు జి.సక్రు, జడ సత్యనారాయణ, మండల నాయకులు సీహెచ్.గణేష్, జడ ఐలమ్మ, గోళ్ళ మాధవరావు, పాక వీరన్న, జంగాల పెంటయ్య, రాందాస్, భద్రాజీ, పాక వీరన్న, బజార్ గోళ్ళ గురవయ్య, వెంకన్న, ఎర్రబోయిన రుక్మారావు, గొళ్ళ సుజాత పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను సాధించడమే నివాళి..

కొత్తగూడ : న్యూ డెమోక్రసీ పార్టీ పేదలకు భూములు పంచి, వారి ఆత్మ గౌరవాన్ని పెంచిందని, అమరవీరుల ఆశయాలను (మిగతా 8లో..)

క్యాన్సర్‌పై స్క్రీనింగ్‌తోనే విజయం సాధ్యం

- డీఎంహెచ్‌వో భూక్య రవిరాథోడ్

నెహ్రూసెంటర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌పై స్క్రీనింగ్‌తోనే విజయం సాధ్యమవుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి భూక్య రవిరాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన ప్రమాణాలు పెరగడం, జీవనశైలీలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. బీపీ, షుగర్‌లతో పాటు క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. మారుతున్న ఆధునిక జీవనశైలి, మత్తుపదార్థాల వినియోగం, వంశ పారంపర్య కారణాల వల్ల ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిలో చాలా కేసులు ఆలస్యంగా గుర్తించడంతో రేడియో, కీమో చికిత్సలు తీసుకోవాల్సినా, తిరిగి నయం చేయలేని స్థితిలో ఉండడంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కుటుంబాలు ఆర్థిక భారం, మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని చెప్పారు. బీపీ, షుగర్ అనే పరీక్షలు ఎంత అవసరం అని భావిస్తున్నారో క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని పరీక్షలు చేయించుకోవడం అంతే అవసరం అని చెప్పారు.

నూతన లేబర్ పాలసీ రాజ్యాంగ విరుద్ధం

- సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబా

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రమశక్తి నీతి-2025 పేరుతో తీసుకువచ్చిన నూతన లేబర్ పాలసీ రాజ్యాంగ విరుద్ధమని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబా అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'నూతన లెబర్ పాలసీ-కార్మిక వర్గంపై ప్రభావం' అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికులను బానిసలుగా మార్చేందుకు శ్రమశక్తి నీతిని తీసుకువచ్చారని ఆరోపించారు. నూతన కార్మిక విధానం రాజ్యాంగంలోని సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు తగిన గౌరవం లాంటి అంశాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న కోట్లాది మంది కార్మికులకు సంబంధించిన అంశాలను కార్మిక సంఘాలతో సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని, స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు కావడం లేదని విమర్శించారు. నూతన కార్మిక విధానం ప్రకారం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తున్నారని చెప్పారు. అక్టోబరు విప్లవ స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చర్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, బిల్డింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, దుండి వీరన్న, మల్లయ్య, స్నేహబిందు, సుధాకర్, జయరాజు, శ్రీనివాస్, మోహన్, కోటేశ్వరరావు, మల్లయ్య, దుర్గారావు, సరోజ, మంగమ్మ, భారతి పాల్గొన్నారు.



సీఐటీయూ సెమినార్‌లో మాట్లాడుతున్న సాయిబాబా

వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్తం

సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో కురిసిన వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారిందని సీపీఐ మాజీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అరోపించారు. మునిసిపల్ పరిధి 21, 22, 36 వార్డులను శుక్రవారం సీపీఐ ప్రతినిధి బృందం సబందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల కిరువైపులా చెత్తాచెదారం పెరిగి పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు, పందుల స్వైరవిహారంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. 21వ వార్డులో ఓపెన్ జిమ్ చుట్టూ ఫెన్సింగ్ ధ్వంసమైందని, దానిని అమర్చాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి వార్డుల్లో పారిశుధ్య నిర్వహణతో పాటు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఈ ఉపేందర్, జవాన్ చిరంజీవితో ఫోన్‌లో మాట్లాడి వీధిలైట్లు, పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, సుభానీ, చరణ్, మల్లయ్య, ప్రవీణ్, చారి పాల్గొన్నారు.



రోడ్డు పక్కన ఉన్న చెత్తను చూపుతున్న అజయ్‌సారథిరెడ్డి

న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ధీరజ్ కుమార్

తొర్రూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దారిద్ర్య రేఖకు దిగువగా ఉన్న ప్రజలు, మహిళలు, వికలాంగులు, వృద్ధులకు ఉచితంగా అందించే న్యాయ సేవలను వినియోగించుకొని ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తొర్రూరు కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ అన్నారు. ఈ నెల 9న సెలవు నేపథ్యంలో శుక్రవారం కోర్టు ఆవరణలో నవంబరు 9 లీగల్ సర్వీస్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం పేదలకు అందించే ఉచిత న్యాయ సేవల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సత్వర సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లలో సమస్యలను పరిష్కరించుకోవచ్చని, క్షణికావేశంతో గొడవలు పడవద్దని సూచించారు. 15వ తేదీ నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ పడే కేసులను పరిష్కరించుకుని ప్రశాంత జీవనం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గణపురం రామకృష్ణ, న్యాయవాదులు నాగరాజు, ఐలోని, లాలు, సైదులు, యాకేందర్, గౌస్, రమేష్, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇళ్ల పంపిణీ చేపట్టాలి



సావిత్రిబాయి పూలే విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న 280 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ వెంటనే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ఎమ్డీ.యాకూబ్ అన్నారు. గత 6 నెలలుగా ధర్నాలు, రాస్తారోకోలు, వినతి పత్రాలు అందించినా ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని నిరసనగా పట్టణంలోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల తలరాతలు మార్చిన పూలే ద్వారానైనా ప్రజా ప్రతినిధులకు కనికరం కలిగి ఇండ్ల పంపిణీ చేయాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ధర్నాలు చేస్తున్నా అధికారులు సర్వే చేపట్టి నివేదికలు ఇవ్వకపోవడం సరికాదని, వెంటనే అర్హులను గుర్తించి ఇండ్ల పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్గయ్య, శ్రీను, యాకయ్య, అమీర్, వరలక్ష్మి, అరుణ, వసంత, రాధ, నాగమణి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తొర్రూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మైత్రి వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు జి.ఉపేంద్రాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారు జినుగ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మైత్రి సంస్థ కార్యకర్తలతో పాటు ఇతర కుల సంఘాల కార్యక్రమంలో ఉపేంద్రాచారి చురకుగా పాల్గొనేవాడని, ఆయన గుండెపోటుతో అకాల మరణం తీరనిలోటు అన్నారు. వారి కుటుంబ సభ్యులకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు విప్లవ్ రెడ్డి, గడల శ్రీను, కుర్ర శ్రీనివాస్, కృపాల్, మల్లేశం, జనార్ధన్, శంకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా జోనల్ క్రీడా పోటీలు



హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జరుగుతున్న భద్రాద్రి మల్టీజోన్ క్రీడా, స్పోర్ట్స్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. జట్టు జట్టు మధ్య ఉత్కంఠ పోరు జరిగింది. రెండో రోజు ఆటలు ముగిసే సమయానికి రన్నింగ్, హైజంప్, క్యారమ్స్, చెస్ పోటీలలో వివిధ గురుకుల స్కూల్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. జోనల్ టోర్నీ పోటీలు ఎంతో రసవత్తరంగా నిలిచాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ పోటీలు నువ్వా నేనా.. అన్నట్లు వివిధ పాఠశాలల జట్టు తలపడ్డాయి. అథ్లెటిక్స్ పోటీలు విద్యార్థుల మధ్య హోరెత్తించాయి. రెండో రోజు ఆటలు ముగిసేసరికి అండర్ 14 చెస్ పోటీలలో మరిపెడ, నర్సంపేట, పాల్వంచ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్ 17లో పాల్వంచ, దమ్మపేట, అండర్ 19 విభాగంలో పాల్వంచ, ముదిగొండ విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. 400 మీటర్ల పరుగు పందెంలో ఎం.నిఖిల్ (మణుగూరు), ఆర్.సాంబశివ(మరిపెడ), టి.సన్నీ(వర్ధన్నపేట), అండర్ 17 విభాగం 1500 మీటర్ల రన్నింగ్ పోటీలలో వి.రాహుల్(పాల్వంచ), ఎం.బన్నీ (దమ్మపేట), ఆర్.లోకేశ్(పాల్వంచ), అండర్ 19లో జీఎల్‌కే మాధవ్(పాల్వంచ), జె.గౌతమ్(దమ్మపేట), టి.కార్తీక్ (పాల్వంచ) గురుకుల స్కూల్స్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. క్యారమ్స్ పోటీలలో పాల్వంచ, మరిపెడ విద్యార్థులు గెలుపొందారు. క్రీడా, స్పోర్ట్స్ పోటీలకు హాజరైన విద్యార్థులకు నిర్వాహకులు, పౌష్టికాహారం, వసతి సౌకర్యాలు కలిపించారు.

పోటీ పరీక్షలతోనే మెదడుకు పదను

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షలతోనే విద్యార్థుల మెదడుకు పదను అవుతుందని మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యానా నిర్వహించిన పాఠశాలల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలను ఆయన ప్రశ్న పత్రాలు విడుదల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పుస్తక పఠనంతో పాటు బయటి ప్రపంచ విషయాలను తెలుసుకోని పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. పాఠశాలల స్థాయి పోటీలలో మరిపెడ స్కూల్‌కు చెందిన ఎస్.అనూష, వి.శ్రీఉదయ్‌కిరణ్, బి.స్వాతి మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను ఆ పాఠశాల హెచ్ఎం అనంతరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మరిపెడ మండల బాధ్యులు బయ్యగాని రాంమోహన్, నవీన్‌కుమార్, జనార్ధనాచారి, శ్రీశైలం, స్వప్న, దేవ్లా, నెహ్రూ, ప్రకాశ్, శౌరి, రమేశ్‌రెడ్డి, లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహేదాబేగం, బాబురావు, అనిత, మంజుశ్రీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సిబ్బంది చేతివాటం?

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మున్సిపాలిటీలో చేతివాటం ప్రదర్శిస్తూ పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటివల రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సుందరీకరణపై నిధులు విడుదల చేస్తే వాటాలుగా పంచుకొని పని నిర్వాహకుడికి సగమే చెందిందని పట్టణ వ్యాప్తంగా మునిసిపల్ అధికారుల చేతివాటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా పంచాయతీగా ఉన్నప్పుడు కొందరు సిబ్బంది డబ్బులు తీసుకొని డోర్ నంబర్లు వేరే వారి పేర్లపై మార్పిడి చేసినట్లు తెలుస్తుంది. దీంతో అసలు బాధితులు ఆర్‌టీఐ కింద దరఖాస్తు చేస్తే ఆ విషయాన్ని సిబ్బంది పేర్లు మార్చుకున్న వారికి చేరవేసి సిబ్బందే వాళ్లపేర్ల పోర్జరీ సంతకాలతో దరఖాస్తులు చేశారని ఓ వ్యక్తి ఈ విషయాలను సోషల్ మీడియాలో వైరల్ చేయగా నెటిజన్లు మునిసిపల్ అధికారుల తీరుపై భగ్గుమంటున్నారు. ఈ విషయంపై మరిపెడ మునిసిపల్ కమిషనర్ విజయానంద్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది ఏలాంటి తప్పిదాలకు పాల్పడిన విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చిన్నగూడూరు యువకుడికి గోల్డ్ మెడల్



క్రాంతిరణదేవ్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, వీసీ ఉమేశ్

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల కేంద్రానికి చెందిన మోడెం వెంకన్న-విజయ దంపతల కుమారుడు క్రాంతిరణదేవ్‌కు కరీంనగర్ శాతావాహన యూనివర్సిటీ టాపర్‌గా నిలువడంతో గోల్డ్ మెడల్ దక్కింది. శుక్రవారం ఆ యూనివర్సిటీ కాన్వకేషన్ వార్షికోత్సవంలో భాగంగా క్రాంతిరణదేవ్ ఎంఏ సోషియాలజీలో కాలేజీ టాపర్‌గా నిలువడంతో రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, వీసీ ఉమేశ్‌కుమార్ గోల్డ్ మెడల్‌ను ఆయనకు అందచేశారు. క్రాంతిరణదేవ్ హైస్కూల్, ఇంటర్మీడియేట్ విద్య ఖమ్మం పట్టణంలో, బీటెక్ ఏరోనాటికల్ ఇంజినీర్‌గా హైదరాబాద్ అంబేద్కర్ యూనివర్సిటీ, పీజీ కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో కొనసాగింది.

వ్యర్థాలు తిని దుక్కిటెద్దు మృతి

తాడ్వాయి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నార్లాపూర్‌కు చెందిన దారావత్ బిచ్చా నాయక్ అనే రైతు దుక్కిటెద్దు వ్యర్థాలు తిని మృతి చెందిందని స్థానిక పశుసంవర్ధక సిబ్బంది తెలిపారు. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు పరిసర అటవీ ప్రాంతాల్లో వదులుతున్న వ్యర్థాలు, పేపర్, ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లను తిని జీర్ణం కాక కడుపు ఉబ్బి చనిపోయిందని అన్నారు.

రామప్పను సందర్శించిన నీతి అయోగ్ అధికారి

వెంకటాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారీ అధికారి, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ అన్వేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయనను ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించి పట్టువస్త్రాలు అందజేశారు. ఈసందర్భంగా అన్వేష్‌కుమార్ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు



తొర్రూరు ఇమేజింగ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

తొర్రూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపతులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ప్రైవేటు ఆసుపత్రులు, తొర్రూరు ఇమేజింగ్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రి మేనేజ్‌మెంట్ అత్యవసర సంబంధిత ఫోన్ నంబర్‌లు, సేవలకు తీసుకునే రుసుము ధరల పట్టికను, ఆసుపత్రులలో పనిచేసే వైద్యుల వివరాలు డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. పీఎన్‌డీటీసీ, ఫైర్ సేఫ్టీ తదితర పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సీజ్ చేస్తామన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఎంబీబీఎస్ అర్హత పరీక్ష ఉత్తీర్ణత చెందాలని, విదేశాల్లో ఎంబీబీఎస్ చదువుకుని ఎండీ. ఎంఎస్ బోర్డులు ఏర్పాటు చేస్తే వారి లైసెన్సులు రద్దుకు సిఫారసు చేస్తామన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు జిల్లా కార్యాలయంలో అన్ని వివరాలు రికార్డులు అందించాలని తెలిపారు. నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కె. ప్రసాద్, ఎస్. స్వామి సిబ్బంది తదితరులు ఉన్నారు.

గర్భిణుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలు నిండిన గర్భిణుల పేర్లను తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయాలని మరిపెడ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన నెలవారి సమీక్ష జరిపి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఊరూరా ఉన్న దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందించి మందులు ఇవ్వాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పల్లె దవాఖానా వైద్యు లు డాక్టర్ కిరణ్, సిరి, సాయిశ్రీ, జాన్సీ, ఉపేంద్ర, సౌజన్య, అఖిల, సరిత, పీహెచ్ఎన్‌వో మంగమ్మ, సూపర్‌వైజర్లు ఆచార్యులు, సుదర్శన్, లక్ష్మీకుమారి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లో అన్నప్రాసన

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ విలేజీలోని అంగన్‌వాడీ సెంటర్లో అంగన్‌వాడీ టీచర్ ముదిరెడ్డి శ్రీలత పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం మదర్స్ కమిటీ బాధ్యులతో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశువులు, ప్రీ స్కూల్ పిల్లలు ఈ సెంటర్ల ద్వారా అందచేస్తున్న పోషకాహార పదార్థాలను వినియోగించుకో వాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ ఆషిక్, ఆస్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మరిపెడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తుఫాన్ ప్రభావంతో బైక్‌పై చెట్టు కూలి తానంచర్ల గ్రామ వాసి లక్ష్మీనారాయణ మృతి చెందారు. ఆయన అక్కడ గణేశ్ మెడికల్ స్టోర్ నిర్వహిస్తూ అకాల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని సహచర మెడికల్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తానంచర్లకు వెళ్లి పరామర్శించారు. వారి వంతు సహాయంగా రూ.30వేలు లక్ష్మీనారాయణ భార్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జక్కుల అశోక్, గాండ్ల రాజేందర్, మూడ్ శ్రీకుమార్, గొడుగు శ్రీను, వెంకటేశ్, వేణు, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

డోర్నకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దాశరధి మహిళ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో తాత్కాలిక ప్రాతిపదికన సీఈవో ఉద్యోగానికి అర్హులైన స్త్రీ, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ కొప్పుల కళావతి, వైస్‌చైర్మన్ మండలి పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈవో ఉద్యోగానికి అగ్రికల్చర్ బీఎస్సీ, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, డిప్లొమా, బీటెక్, అగ్రికల్చర్‌లో డిగ్రీ, డిప్లొమా కలిగి ఉన్నవారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 12వ తేదీలోగా డోర్నకల్, మరిపెడ, చిన్నగూడూరు మండలాల్లోని మండల సమాఖ్య కార్యాలయంలో అందించాలని వారు కోరారు.

మత్స్యకారులకు భరోసా



పాగుళ్లపల్లి చెరువులో చేపలు వదులుతున్న అధికారులు

కొత్తగూడ, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ప్రభుత్వమే ఆర్థిక భరోసా అని, భారీ వర్షాలకు చేపలు కొట్టుకుపోయి నష్టపోయిన మత్స్యకారులకు సర్కారు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ ముదిరాజ్ కోరారు. పొగుళ్లపల్లిలో శుక్రవారం జిల్లా మత్స్యశాఖ అధికారి గంగన్ శివప్రసాద్ ఆధ్వర్యంలో చేపల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇంతకు ముందు చెరువుల్లో వేసిన చేపలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మరోమారు చేపట్టిన ఉచిత చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని, చెరువుల్లో చేపలు పోసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఉదయ్, జిల్లా ప్రమోటర్ లింగాల పిచ్చయ్య ముదిరాజ్, జిల్లా మహసభ నాయకుడు దుండి మధుకర్ ముదిరాజ్, పొగుళ్లపల్లి సొసైటీ అధ్యక్షుడు బైరబోయిన బుచ్చిరాములు ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ బైరబోయిన సదానందం ముదిరాజ్, కొమురయ్య, మత్స్యశాఖ అధికారులు శ్రీనివాస్, సురేష్, శ్రీపతి, శివశంకర్, విష్ణు, వేణు, రాజు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

అనాథ వృద్ధురాలిని అన్నం ఫౌండేషన్‌కు తరలించిన సతీష్



సైదమ్మను అన్నం ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో చేర్పించడానికి తీసుకువెళ్తున్న ఎస్సై సతీష్

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిలువ నీడలేని ఓ వృద్ధురాలిని అనాథ ఆశ్రమంలో చేర్చి, మానవత్వం చాటుకున్నాడు ఎస్సై సతీష్. బలపాలలో సైదమ్మ అనే వృద్ధురాలు భర్త చనిపోవడంతో ఉండడానికి ఆశ్రయం లేక బస్టాండ్‌లో నివసిస్తోంది. ఈ విషయం గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న ఎస్సై. తన సిబ్బందితో కలిసి బలపాల వెళ్లి సైదమ్మనుపలకరించారు. ఆమెకు స్నానం చేపించి కొత్తదుస్తులు వేయించి, అన్నం పెట్టించి దుప్పట్లు, దుస్తులు అందించారు. అనంతరం అనాథ ఆశ్రమంలో ఉండేందుకు వృద్ధురాలు ఒప్పుకోవడంతో ఆమెను ఖమ్మం అన్నం ఫౌండేషన్ సంస్థలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ అన్నం ఫౌండేషన్‌కు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వీరస్వామి, రమేష్ ఉమెన్ పీసీ శివాని, పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసి, ఒకవ్యక్తి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీరోలు ఎంఈవో లచ్చిరాంనాయక్‌పై చీటింగ్, క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాదాపురం శివారులో వివాదానికి కారణమైన సీసీ రోడ్డును సీపీఐ బృందం శుక్రవారం పరిశీలించింది. కర్నం రాజన్న, తురక రమేష్, బుడమ వెంకన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించిన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఉంటారని, చదువుల్లో సైతం రాణిస్తారని ఎస్సై సతీష్ అన్నారు. కురవిలో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన జూనియర్ విభాగం కబడ్డీ, ఖో-ఖో క్రీడోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ట్రస్మా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, నాయకులు అలువాల కార్తీక్, భూక్య రవికుమార్, రాము, జలిక శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

రేపటి నుంచి

దూరవిద్య పీజీ తరగతులు

కేయూ క్యాంపస్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు నవంబరు 9 ఆదివారం నుంచి జరుగుతాయని ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 9, 11, 23, 30 తేదీల్లో డిశంబరు 7, 13, 14, 21, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి కేయూ దూరవిద్యం కేంద్రంతో పాటు ఎంపిక చేసిన అధ్యయన కేంద్రాల్లో జరుగుతాయని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్టీ గురుకుల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ

కాటారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభను చాటారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో వివిధ క్రీడలు, అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 19మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పీడీ గౌతమి, పీఈటీ శ్రీదేవి శుక్రవారం తెలిపారు. టగ్ ఆఫ్ వార్‌లో శ్రీజ, హారిక, నిఖిల, అలేఖ్య, క్రికెట్‌లో సంగీత, సుచరిత, సాయికీర్తన, హ్యాండ్‌బాల్‌లో సాయికీర్తన, శ్రీలేఖ, బ్యాడ్మింటన్‌లో రమ్య, శరణ్య కుమారి, సాఫ్ట్‌బాల్‌లో సుచరిత, నెట్‌బాల్‌లో వైష్ణవి, బేస్‌బాల్‌లో సుచరిత, 1500 మీటర్ల రన్నింగ్‌లో సోనీ, షైనీ, 100 మీటర్లు రన్నింగ్ విభాగంలో సాయికీర్తన సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. హైదరాబాద్ లో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ పీడీ, పీఈటీతోపాటు వైస్ ప్రిన్సిపాల్స్ సరిత, కల్పన, ఉపాధ్యాయులు అభినందించారు.

వీరభద్రస్వామి ఆలయ భూమికి రక్షణ



హైదరాబాద్‌లో వీరభద్రస్వామి ఆలయ భూమి వద్ద ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయానికి హైదరాబాద్ సీతాఫల్‌మండిలోని బస్తీలో 107 గజాల స్థల ఉంది. చాలా ఏళ్లక్రితం హైదరాబాద్‌కు చెందిన భక్తులు వీరభద్ర స్వామి ఆలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ భూమిని పక్క స్థలం వారు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా, దేవాలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డిలు కోర్టులో కేసువేసి ఆ భూమి దేవాలయానికి సంబంధించిందిగా నిరూపించడంతో ఆ భూమి దేవాలయానికి సంబంధించినదిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం భూమి వద్దకు వెళ్లిన ఆలయ అధికారులు దానికి ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు హర్షిత



కొత్తగూడ, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలకు పొగుళ్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రెడ్డబోయిన హర్షిత ఎంపికయ్యారని హెచ్ఎం విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6న ములుగు జిల్లా పాలంపేటలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రీడల్లో మహబూబాబాద్ జిల్లా కబడ్డీ జట్టు తరఫున పాల్గొన్న హర్షిత ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈనెల 8నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడలకు హర్షిత ఎంపికయ్యారని పేర్కొన్నారు. దీంతో హర్షితను ఉపాధ్యాయులు నెల్లుట్ల భాస్కర్, సుమన్, సుధాకర్, రాజ్‌కుమార్, పాషమియా, నర్సయ్య, సాంబయ్య, వసంత, జుమ్మలాల్, శ్రీలత, మాధవి, మదన్మోహన్ అభినందించారు.

మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా నాగేందర్

కురవి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మోకుదెబ్బ మండల అధ్యక్షుడిగా తండ నాగేందర్‌గౌడ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్ తెలిపారు. కురవిలో శుక్రవారం నిర్వహించిన గౌడజనహక్కుల పోరాట సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం గౌడ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బుడిగె భద్రసేనగౌడ్, సీహెచ్.కాశయ్య, ఉపేందర్‌గౌడ్, వీరభద్రం, సూరయ్య, విజయ్‌కుమార్, మల్లేష్, పరమేష్ పాల్గొన్నారు.

గడ్డిమందు తాగిన వృద్ధుడు మృతి

డోర్నకల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి ముల్కలపల్లిలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రాములు తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన బొజ్జ వెంకటనారాయణ (85)కు కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండడం లేదు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగాడు. ఈ విషయం గమనించిన అతడి భార్య ఝాన్సీ చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటనారాయణమృతి చెందాడు.

ఈ మేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పదోన్నతిపై సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

వరంగల్ లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ముగ్గురు జడ్జిలకు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కమ్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న క్షమాదేశ్ పాండేను వరంగల్ అవినీతి నిరోధక ప్రత్యేక కోర్టు(ఏసీబీ) జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా నర్సంపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వరూధినికి అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ నిజామాబాద్ నాలుగో అదనపు జిల్లా సెషన్స్ జడ్జిగా నియమించింది. జనగామ సీనియర్ సివిల్ జడ్జి కమ్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విక్రమ్‌ను కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టు జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం వరంగల్ అర్బన్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అబ్జర్వర్ ఎక్సైజ్ సీఐ బి.ప్రభావతి తెలిపారు. అధ్యక్షుడిగా ఖిలావరంగల్ సీఐ కె.రాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా హనుమకొండ ఎస్సై సీహెచ్.వెంకన్న, వైస్ ప్రెసిడెంట్‌గా భూపాలపల్లి డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య, జనరల్ సెక్రటరీగా పరకాల ఎస్సై వై.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జనగామ సూపరింటెండెంట్ జనార్దన్, జాయింట్ సెక్రటరీగా జనగామ సీఐ బి.ప్రభావతి, కోశాధికారిగా వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.నాగయ్య, ఈసీ మెంబర్స్‌గా నర్సంపేట సీఐ నరేశ్‌రెడ్డి, వరంగల్ అర్బన్ ఎస్సై ఎస్.పద్మ, వర్ధన్నపేట ఎస్సై వి.గంగాధర్, తొర్రూరు ఎస్సై ఎం.రవళి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ.. అధికారుల సర్వీసుకు సంబంధించి శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

- నెల రోజులుగా కుటుంబ సభ్యులతో పరారీ

శాయంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అక్రమాలకు పాల్పడిన ప్రధాన నిందితుడు బెజ్జంకి శ్రీనివాస్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం శాయంపేట, కాట్రపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో గత రబీ సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రూ.1.87 కోట్లు అక్రమాలు జరిగినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. దీనిపై అక్టోబరు 11న శాయంపేట పీఎస్‌లో 21 మందిపై కేసు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితుడు మిల్లర్ బెజ్జంకి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో సహా గత నెల రోజులుగా పరారీలో ఉన్నాడు. ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నా లభించలేదు. దీంతో పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈనేపథ్యంలో పక్క రాష్ట్రంలోని గుంటూరులో ఉన్నాడని సమాచారం తెలుసుకున్న పోలీసులు 8 మంది కుటుంబ సభ్యులతో సహా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులను విచారిస్తున్నట్లు సమాచారం.

గురుకులాల పదోన్నతుల్లో జాప్యం

- పెండింగ్‌లో 1,650 మంది ఉద్యోగుల ప్రమోషన్లు
- వివిధ స్థాయిల్లో పలు పోస్టులు ఖాళీ
- 140 గురుకులాలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లే దిక్కు
- గాడితప్పుతున్న గురుకుల విద్యా వ్యవస్థ
- నష్టపోనున్న దళిత, బలహీన వర్గాల విద్యార్థులు

హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పదోన్నతుల్లో జాప్యం వల్ల వారు సర్వీస్ పరంగా, ఆర్థికంగానూ నష్టపోతున్నారు. అనేక ఏళ్లుగా పదోన్నతులు లేక గురుకులాల్లో విద్య గాడి తప్పుతోంది. గురుకులాల్లో 1,650 పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మంది ఉద్యోగులకు పదోన్నతులు రావలసి ఉంది. కింది స్థాయిలో పదోన్నతులను పట్టించుకోవడం లేదు కానీ, పైస్థాయిలో మాత్రం ఉన్నతాధికారులు పదోన్నతుల మీద పదోన్నతులు అక్రమంగా పొందుతున్నారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 250కి పైగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు ఉన్నాయి.

సీనియారిటీ లిస్టు ప్రకటించినా..

ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు రెగ్యులర్ ఉద్యోగుల ఫైనల్ సీనియారిటీ లిస్టును అన్ని కేడర్లలో ప్రకటించారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి జోనల్ ఆఫీసర్, జాయింట్ సెక్రెటరీ స్థాయి వరకు చెక్ స్లిప్స్ కూడా తీసుకున్నారు. దీనితో పదోన్నతుల ప్రక్రియ ఇక పూర్తవుతుందని ఉద్యోగులు ఆశపడ్డారు. ఇంతలో సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిని కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌కు బదిలీ కావడంతో ఈ ప్రక్రియ అటకెక్కింది. ప్రస్తుతం క్రిష్ణ ఆదిత్య ఎఫ్ఏసీ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కానీ పదోన్నతుల ప్రక్రియలో కదలిక లేదు.


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల

ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చాలా వాటికి పూర్తి స్థాయి ప్రిన్సిపాళ్లు కూడా లేరు. సుమారు 140 గురుకులాలు ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. సీనియారిటీని పరిగణలోకి తీసుకోకుండా అనుభవంలేని వారిని ఇన్‌చార్జిలుగా నియమించడంతో గురుకులాల నిర్వహణ గాడితప్పుతోంది. అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లలో చాలామంది పలుకుబడి, పైరవీలతో వచ్చినవారే. దీనితో గురుకులాల్లో పాలన ఇష్టారాజ్యంగా నడుస్తోంది.

పైస్థాయిలో అక్రమ పదోన్నతులు

జోనల్ ఆఫీసర్స్, జాయింట్ సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ స్థాయిల్లో కూడా ఉద్యోగ విరమణలు, కొందరు వీఆర్ఎస్ తీసుకోవడం వల్ల దాదాపు 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ సెక్రెటరీలకు డిప్యూటీ సెక్రెటరీగా ఒక పోస్టుకు మాత్రమే అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ గురుకుల నిబంధనలకు విరుద్ధంగా 5 పోస్టుల్లో డిప్యూటీ సెక్రెటరీలుగా పదోన్నతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా అక్రమంగా ప్రమోషన్లు పొందిన వారిని వెంటనే రివర్టు చేసి ఆ పోస్టుల్లో సీనియర్ ప్రిన్సిపాల్స్‌కు జోనల్ అధికారి, డిప్యూటీ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీలుగా పదోన్నతులు కల్పించాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఒక జోనల్ అధికారి మూడు జోన్ల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వారికి పనిభారం ఎక్కువ కావడం వల్ల పర్యవేక్షణ లోపించి గురుకులాల పరిపాలన అస్తవ్యస్తంగా మారుతోంది.

తక్షణం పదోన్నతులు కల్పించాలి

అలగోని నరసింహులు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో 1650 మంది ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 250మంది నుంచి 300 మందికి ప్రమోషన్లు రావలసి ఉన్నది. పదోన్నతులు ఇవ్వడంలో ఉన్నతాధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే బలహీన వర్గాలు, ఎస్సీ దళిత విద్యార్థులు చదువుతున్న సంక్షేమ గురుకులాల్లో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని, పర్యవేక్షణ లోపం వల్ల గురుకుల వ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీనియారిటీ ప్రకారం అర్హులైన సంక్షేమ గురుకుల ఉద్యోగులు, జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ జోనల్ ఆఫీసర్, డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీ స్థాయిల్లో పదోన్నతులు కల్పించాలి.

గంగదేవిపల్లిని సందర్శించిన నేపాల్ దేశస్థులు

- జాతీయ గీతాన్ని ఆలపించిన విదేశీ బృందం


గ్రామస్థులు, విద్యార్థులతో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న నేపాల్ బృందం

గీసుగొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని నేపాల్ దేశానికి చెందిన 15 స్వచ్ఛంద సంస్థల 17 మంది ప్రతినిధి బృందం బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా వందేమాతరం గీతం ఏర్పాటై 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, గ్రామస్థులతో పాటు వందేమాతరం గీతాన్ని వారు ఆలపించారు. అనంతరం గ్రామంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామం అభివృద్ధి చెందిన తీరు, జాతీయస్థాయికి ఎదిగిన విధానం, సాధించిన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గురించి విదేశీ బృందానికి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. గ్రామాభివృద్ధిని, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యాన్ని ప్రతినిధి బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ సింగారెడ్డి సునీత, కొట్టె రమాదేవి, విదేశీ బృందం ప్రతినిధులు త్రిబేనికుమార్ యాదవ్, జనక్‌కర్కి, రుక్మణికర్కి, అర్చన చౌదరి, గుణేష్ బహదూర్ ఠాకూర్, విష్ణుప్రసాద్ కున్వర్, ఉమేష్‌న్యూపానె, బినోద్ కుమార్ బిషంకే, హరినారాయణ్‌ప్రసాద్, సంజయ్‌కష్యాషాహీ, శత్రుఘ్నసింగ్, దివాకర్‌ఝా, రౌనక్‌రాజ్, చాందనీషా, శ్యామ్‌సుందర్ సింగ్, స్థిరానాబస్నెట్, శ్యామ్‌కుమారీసాహ్, గ్రామ కార్యదర్శి రమ్యకుమారీ, నిమ్మల శేఖర్, గోనె నాగరాజు, హెచ్ఎం రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగృతి జనం బాటను
జయప్రదం చేయాలి

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కవిత పర్యటన
- తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్

వడ్డేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం, ఆదివారం నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లకావత్ రూప్‌సింగ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మారేపల్లి మాధవి కోరారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్రంలో తెలంగాణ జాగృతి ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నదని అన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రైతులు పండించిన ధాన్యం తడిచిపోవడంతోపాటు వరి చేళ్ల నేలబారి రైతాంగం తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రైతుల సమస్యలను గాలికి వదిలి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మునిగారని దుయ్యబట్టారు. మహిళా సాధికారత కేవలం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకే సాధ్యమవుతుందని చెప్పారు. వరంగల్, హనుమకొండ జిల్లాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే తెలంగాణ జాగృతి జనం బాటలో సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొంటారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు కొనసాగే జాగృతి జనం బాటలో భాగంగా మేధావులు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, విద్యార్థులతో మమేకమవుతారని అన్నారు. కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలో దెబ్బతిన్న వరిచేళ్లను పరిశీలిస్తారని చెప్పారు. ఉనికిచర్ల ఎక్స్ రోడ్డు దగ్గర జాగృతి జిల్లా శ్రేణులు కవితకు స్వాగతం పలికి బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం హనుమకొండలో తుఫాన్ తాకిడితో దెబ్బతిన్న సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, అమరావతి నగర్ ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రులు, ఎస్ఆర్ నగర్ వంటి ప్రాంతాలను సందర్శిస్తారని జాగృతి శ్రేణులు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పర్లపెల్లి శ్రీశైలం, వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మేకల రాణి, నేతలు మంజుల, వంశీకృష్ణ, సోల్తి కిశోర్, జన్ను సంతోష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న లకావత్ రూప్‌సింగ్, మారేపల్లి మాధవి

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ

- స్థానిక సంస్థల ఎన్నికల వాయిదా నేపథ్యంలో..
- తిరిగి నిర్వహించే సమయానికి నవీకరణ
- ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలు



హనుమకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రస్తుతం వాయిదా పడడంతో తిరిగి ఎన్నికలు జరిగే నాటికి కొత్త ఓటర్లను నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళితే అప్పటికప్పుడు కొత్త జాబితా రూపొందించడం కష్టంగా మారుతుందని ఇలా ముందస్తు ఓటర్ల జాబితా నవీకరణ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ దిశగా నవీకరణ ప్రక్రియను చేపట్టింది. ఈ విషయంలో ఇప్పటికే అధికారులు ఈ విషయమై క్షేత్ర స్థాయి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల ప్రకటన వచ్చే సరికే తాజా ఓటరు జాబితా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అందుకు ఆయా పంచాయతీల్లో వార్డుల వారీగా కొత్త ఓటర్లు ఎంత మంది ఉన్నారో చూస్తున్నారు.

మరోమారు నవీకరణ

స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను మరోమారు నవీకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాను రెండు మార్లు సవరించారు. ఇప్పుడు ఎన్నికలు వాయిదా పడడంతో తాజాగా మరోమారు నవీకరిస్తున్నారు. ఈనెల 15 వరకు నమోదయ్యే వారి వివరాలను జాబితాలో చేర్చనున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,45,553 మంది ఓటర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3,72,646, వరంగల్ జిల్లాలో 3,85,163, జనగామ జిల్లాలో 4,01,115, మహబూబాబాద్ జిల్లాలో 5,51,999, ములుగు జిల్లాలో 2,31,052 , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,03,556 మంది ఓటర్లు ఉన్నారు.

అవగాహన కార్యక్రమాలు

కొత్త ఓటర్ల నమోదుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థల్లో 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకునే విధంగా కొన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనితో ఎక్కువ మంది ఓటర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో విద్యాసంస్థల నుంచి ఏటా 10వేలకు పైగా 18 సంవత్సరాలు దాటే వయోజనులు పై తరగతులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో అవగాహన కార్యక్రమాల ద్వారా కొత్త దరఖాస్తులు చేయిస్తే అటు కేంద్ర ఎన్నికల సంఘం జాబితాలో ఇటు స్థానిక సంస్థల ఎన్నికల జాబితాలో వారికి చోటు లభిస్తుంది.

ఆన్‌లైన్ ద్వారా సైతం..

జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, ఓటర్ల జాబితా సవరణ సంవత్సరం అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన భారతీయ పౌరులకు ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కూడా భారత ఎన్నికల కమిషన్ కల్పించింది. నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఫారం-6 నింపడం ద్వారా ఓటరుగా నమోదు కావచ్చు. నమోదైన ఓటర్లు తమ నమోదు స్థితిని కూడా తనిఖీ చేసుకోవచ్చు. సాధారణ ఓటర్లు ఫారం-6(ఆన్‌లైన్ ఫారం లింక్) నింపాలి. ఇది కొత్త ఓటర్ల నమోదు కోసం మాత్రమే. ఎన్ఆర్ఐ ఓటరు ఫారం-6ఏ నింపాలి. (ఆన్‌లైన్ ఫారం లింకు).

పత్తి రైతుపై సీసీఐ కత్తి!

(5వ పేజీ తరువాయి)

పత్తి పంట మొత్తం నీట మునిగింది. ఇళ్లలో ఆరబెట్టినప్పటికీ పత్తికి కూడా వరుస వర్షాలతో నిమ్ము చేరింది. పత్తిని ఎండలో ఆరబెడతామంటే మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో సీసీఐ 8 నుంచి 12 శాతం తేమ నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణంలోనే తేమ పెరిగి ఉందని, అలాంటప్పుడు 12శాతం లోపు తేమతో పత్తిని మార్కెట్‌కు తీసుకరావటం ఎలా సాధ్యమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు మద్దతు ధరలో కోత పెడుతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో తేమ శాతాన్ని 18 నుంచి 30 శాతానికి పెంచాలని రైతులు చేస్తున్న విజ్ఞప్తిని సీసీఐ పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.5వేల నుంచి రూ.7వేల వరకే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

జిన్నింగ్ మిల్లర్లతో కొర్రీలు

పత్తి విక్రయానికి వచ్చినప్పటి నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తీసుకువస్తున్న నిబంధనలు రైతుకు గుదిబండగా మారుతున్నాయి. పత్తి కొనుగోలు ప్రక్రియకు ముందే జిన్నింగ్ మిల్లులతో సీసీఐ పంచాయితీకి దిగింది. పాత నిబంధనలను మార్చటంతో మిల్లులను సీసీఐకి అద్దెకు ఇచ్చేందుకు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు నిరాకరించాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రత్యేక చొరవతో జిన్నింగ్ మిల్లుల పంచాయితీ ఓ కొలిక్కివచ్చినట్టే వచ్చినా.. మళ్లీ సీసీఐ కొర్రీలతో మొదటికి వస్తోంది. తెలంగాణలోమొత్తం 322 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 56 మిల్లులను గుర్తించారు. ఒక పత్తి బేల్‌కు రూ.1,440లు చెల్లించేందుకు మిల్లు యాజమానులతో సీసీఐ ఒప్పందం చేసుకుంది. అక్టోబరు చివరివారంలో సీసీఐ ద్వారా కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరిట వర్గీకరించింది. కపాస్ యాప్‌లో తొలుత ఎల్-1 మిల్లుల జాబితానే సీసీఐ ప్రదర్శిస్తోంది. ఆ మిల్లుల్లో సామర్థ్యం పూర్తయితే ఎల్-2కు, ఆ తరువాత ఎల్-3 మిల్లులకు అవకాశం ఇస్తోంది. ఈ విధానంపై జిన్నింగ్ మిల్లర్లు అభ్యంతరం చెప్పుతున్నారు. రైతులు తమ ప్రాంతంలో ఉన్న సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునే అవకాశాన్ని చేజార్చుకుంటున్నారని మిల్లర్లు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా మిల్లుల సామర్థ్యాన్ని బట్టి జాబ్ వర్క్ టెండర్లు ఇవ్వలేదని, అన్ని మిల్లుల్లో బేల్‌కు ఒకటే ధర చెల్లిస్తున్నారని, అలాంటప్పుడు మిల్లుల వర్గీకరణ ఎందుకని, అన్ని మిల్లుల్లో కొనుగోళ్లు ఒకేసారి చేపట్టాలని జిన్నింగ్ అండ్ కాటన్ ఇండస్ట్రీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

చిక్కిన రౌడీషీటర్ సూరి

- అతడితోపాటు ఏడుగురు గన్‌గ్యాంగ్ సభ్యుల అరెస్టు
- కొత్తగట్టు క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడిన నిందితులు
- ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ వెల్లడి

వరంగల్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ దాసరి సురేందర్ అలియాస్ సూరి పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయనతో పాటు గన్‌గ్యాంగ్ సభ్యులైన ఏడుగురిని పట్టుకున్నారు. గత నెల 18న హనుమకొండ జిల్లా శాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాందారిపేట క్రాస్‌రోడ్డు వద్ద లారీ డ్రైవర్‌తో పాటు పెట్రోల్ పంపు నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించిన సంఘటనలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పలు సెక్షన్‌ల కింద రెండు కేసులు నమోదు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. రెండు పిస్తోళ్లు, ఒక కత్తి, ఒక బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు.

వరంగల్ జిల్లా నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన దాసరి సురేందర్ అలియాస్ సూరి హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. ఈయనపై రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో రౌడీషీట్‌తోపాటు 3సార్లు పీడీ యాక్టు నమోదు, 2 పోక్సో కేసులు, భార్య హత్య కేసు, దాదాపు 44 కేసులు నమోదయ్యాయి. దీంతో సూరిని అక్కడి పోలీసులు గత ఏప్రిల్‌లో నగర బహిష్కరణ చేయగా, తన మకాంను హనుమకొండలోని భీమారానికి మార్చారు. ఈ క్రమంలో స్థానిక యువకులను చేరదీసి గ్యాంగ్ నిర్వహిస్తూ గంజాయి సేవించేవాడు. ఈ క్రమంలో సురేందర్ అనుచరుడైన భూపాలపల్లికి చెందిన బాసిత్‌ను ఇటీవల కొందరు యువకులు గ్యాంగ్‌వార్‌లో భాగంగా హత్య చేశారు. బాసిత్‌ను హత్య చేసిన సోనూ, బబ్లూను చంపేందుకు బాసిత్ బావ ఖారుఖ్‌ఖాన్ సూరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా గత అక్టోబరు 18న సూరి మరో ఏడుగురు వ్యక్తులను రెండు ద్విచక్ర వాహనాలపై ఎక్కించుకొని శాయంపేట పీఎస్ పరిధిలోని మాందారిపేట గుట్టలకు చేరుకొని అక్కడ మద్యం సేవించారు. అనంతరం మాందారిపేట క్రాస్ వద్ద లారీ డ్రైవర్‌ను ఆపి పిస్తోల్‌తో కొట్టి బెదిరించారు. అక్కడి నుంచి సమీపంలోని భారత్ పెట్రోల్‌పంపులోకి వెళ్లి పెట్రోల్ పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకులను పిస్తోల్‌తో బెదిరించి పారిపోయారు. సిరిసిల్లకు చెందిన లారీడ్రైవర్ కొమిరె రజినీకాంత్ ఫిర్యాదు మేరకు శాయంపేట ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేశారు. శుక్రవారం కొత్తగట్టు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సురేందర్‌తో పాటు అతడి అనుచరులు ఏడుగురు, రెండు పిస్తోల్స్, ఒక బుల్లెట్, కత్తితో పట్టుబడ్డారని డీసీపీ వివరించారు.



స్వాధీనం చేసుకున్న పిస్తోళ్లు, కత్తి, బుల్లెట్‌ను పరిశీలిస్తున్న డీసీపీ

బిహార్ నుంచి పిస్తోల్స్ కొనుగోలు

రౌడీషీటర్ సురేందర్ జైలులో ఉన్నప్పుడు హైదరాబాద్ నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యకుమార్ ఠాకూర్ పరిచయమయ్యాడు. 4 నెలల కిందట బిహార్‌లోని భగల్పూర్ జిల్లా నగోచియ మండలంలోని నగర గ్రామంలో కుందన అనే వ్యక్తి నుంచి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్, ఒక్క బుల్లెట్‌కు రూ.500 చొప్పున 9 బుల్లెట్‌లు కొనుగోలు చేశాడు. నెల తర్వాత సురేందర్ గ్యాంగ్‌లో సభ్యుడైన ములుగు జిల్లాకు చెందిన సామ్రాజ్ చక్రికి ఆదిత్యఠాకూర్ రూ.50వేలకు పిస్తోల్‌తో పాటు 6 రౌండ్స్‌లు కొనుగోలు చేసి ఇచ్చాడు. కాగా, ఇవే పిస్తోల్స్‌తో శుక్రవారం శాయంపేట పోలీసులకు సురేందర్‌తో పాటు ములుగుకు చెందిన సామ్రాజ్ చక్రి, భీమారానికి చెందిన చంచు రాహుల్, కోమటిపల్లికి చెందిన నమిండ్ల శివ, భీమారానికి చెందిన డాగ్ ట్రాన్స్‌పోర్టర్ రౌతు శివ వైభవ్, ములుగుకు చెందిన సామ్రాజ్ క్రాంతి, ఎనుగుల నితిన్, నానక్‌రామ్‌గూడకు చెందిన ఆదిత్యఠాకూర్ పట్టుబడ్డట్టు డీసీపీ వెల్లడించారు. కాగా, రాచకొండలో సురేందర్‌పై 44 కేసులు నమోదు కాగా, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని శాయంపేటలో తాజాగా రెండు కేసులు నమోదయ్యాయన్నారు.

ఈ సందర్భంగా గ్యాంగ్ సభ్యులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి డీసీపీ రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, మామునూరు ఏసీపీ వెంకటేశ్, శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, ఎస్సై పరమేశ్వర్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన
సర్జన్స్ సదస్సు

వరంగల్ మెడికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర విభాగం 11వ వార్షికోత్సవం శుక్రవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో గల ఎస్ఆర్ఐ ఆడిటోరియంలో లాంఛనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ కాన్ఫరెన్స్‌ను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, కాకతీయ మెడికల్ కాలేజీ సర్జరీ విభాగాలు సంయుక్తగా నిర్వహిస్తున్నాయి. ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్‌దాస్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ జీవన్‌రావు, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదటి రోజు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, యువ సర్జన్లకు శిక్షణ తరగతులు, పీజీ క్లినిక్స్, చేతిపని శిక్షణ వంటి విద్యా కార్యక్రమాలను నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సంస్థ 1938లో స్థాపించబడిందని, దీని ముఖ్య ఉద్ధేశం రాష్ట్రంలోని సర్జన్లందరు ఒకేచోట కలుసుకొని వృత్తిపరమైన అనుభవాలు పంచుకోవడానికి అని ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ కూరపాటి రమేశ్ తెలిపారు. చరిత్రాత్మకమైన వరంగల్ నగరంలో టీఎస్ ఏఎస్ఐ 11వ వార్షికోత్సవం జరగడం శస్త్రచికిత్సలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం సమకూరుతుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ అప్పాల సుధాకర్, డాక్టర్ బి.ఆర్.సిద్దార్థ, డాక్టర్ నాగేంద్ర, వివిధ మెడికల్ కళాశాలలకు చెందిన ఫ్యాకల్టీ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.


సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం పాతబజారులోని పలు కాలనీలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట పట్టణంలోని ఆర్తిగార్డెన్, వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ ఏరియా, ఫారెస్ట్ సెంటర్, కల్లు కాంపౌండ్ ఏరియా, భవాని నగర్‌తండా, హస్తినాపురం కాలనీ, నందనాగార్డెన్, ఆ ర్టీసీ బస్టాండ్, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఏటిగడ్డ తండా, స్నేహనగర్, అంబేద్కర్ నగర్ కాలనీల్లో సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడా వస్తువుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దివంగత చౌడవరపు వెంకటేశ్వర్లు జయంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి సుమలత, కుమారుడు సాయిక్రిష్ణ క్రీడా వస్తువులు పంపిణీ చేశారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు గుగులోతు లక్ష్మీ మాట్లాడారు. కుటుంబసభ్యులు మంచాల రాధాకృష్ణ, లక్ష్మీ, కుమార్తె పూజిత, నాగేంద్రబాబు, గ్రామస్థులు చిరంజీవి, చీరిక ఉపేందర్‌రెడ్డి, నీలం రమేష్, ఉపాధ్యాయులు రవి, రాధిక, సువర్ణ, శ్రీజ, రామసహాయం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం కింద భవనాల మంజూరు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద భవనాలు మంజూరయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 482 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 636 గ్రామ సమైఖ్య సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామ పంచాయితీలోని ఒక్కొక్క మహిళా సంఘానికి ప్రభుత్వ భూములు, గ్రామకంఠ భూములు, స్థల దాతలు ఉంటే గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా డీఆర్డీవో పీడీకి ఆ పత్రాలను అందజేస్తే భవనాలను మంజూరు చేయనున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి



అనంతారం రోడ్డులో అండర్ పాస్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ శివారు అనంతారం రోడ్డులో ఉన్న రైల్వేఅండర్ పాస్ వద్ద వర్షాలతో ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ అన్నారు. సదరు డిమాండ్‌లో అనంతారం రోడ్‌లోని అండర్ పాస్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అండర్ పాస్ వద్ద రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంద శ్రీనివాస్, జలగం ప్రవీణ్, అనిల్, యశ్వంత్, శ్రీనివాస్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

కేసముద్రం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కన్వీనర్ కొమ్ము రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లందాసు సతీష్, చింతల కుమార్, కదారి నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెహ్రూసెంటర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మహబూబాబాద్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బానోత్ కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ అథ్లెటిక్స్, క్యారమ్, చెస్ క్రీడలను గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని, వారిని అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వట్టం శంకర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినికి అస్వస్థత

నెహ్రూసెంటర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల డిగ్రీ కళాశాల వసతి గృహంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైంది. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్, వార్డెన్, స్టాఫ్‌నర్సులు హుటాహుటిన చికిత్స నిమిత్తం జిల్లా అస్పత్రికి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. ఈ విషయంపై హాస్టల్ ప్రిన్సిపల్ బిందుమాధవిని వివరణ కోరగా ప్రతినెల సదరు విద్యార్థిని అస్వస్థతకు గురవుతుందని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్లు వివరణ ఇచ్చారు.

ఏకాగ్రతతో వాహనాన్ని నడపాలి

కేసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భారీ వాహనాల చోదకులు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని సీఐ వై.సత్యనారాయణ సూచించారు. కేసముద్రంలో పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవలె పెద్ద ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో ప్రజలు చనిపోయారని గుర్తు చేశారు. డ్రైవర్లు వాహనాన్ని నడుపుతున్నప్పుడు ప్రతీ క్షణం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రతీ డ్రైవరు లైసెన్సు, వాహనానికి బీమా కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు క్రాంతికిరణ్, నరేష్, నెల్లికుదురు, ఇనుగుర్తి ఎస్ఐలు సీహెచ్.రమేష్‌బాబు, జి.కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీజేపీ నేతలు



మునిసిపల్ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కమిషనర్ రాజేశ్వర్, అధికారులు



మహబూబాబాద్‌లో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

వందేమాతరం గీతానికి 150 ఏళ్లు

● జిల్లా వ్యాప్తంగా గీతాలాపన

మహబూబాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహాకవి బంకించంద్ర చటర్జీ వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో వందేమాతరం సామూహిక గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. అనిల్ కుమార్, జిల్లా అధికారులు దక్షిణామూర్తి, మరియన్న, శ్రీనివాసరావు, కృష్ణవేణి, శ్రీనివాస్, వెంకటరమణ, టీఎన్జీవోస్ వడ్డెబోయిన శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, పవన్ కుమార్, విజయ, విజయకుమారి, మురళీ, ఆర్. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, సక్కుబాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● మునిసిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసిన వందేమాతర గీతం నవంబర్ 7తో 150 సంవత్సరాలు పూర్తి చేసుకుందని చెప్పారు. ఈకార్యక్రమంలో సిబ్బంది కరుణాకర్, సింగు రమేష్, సుధాకర్, మమ్ముట్టి పాల్గొన్నారు.

● మహబూబాబాద్ బీజేపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్, ఓర్సు పద్మావతి, సింగారపు సతీష్, దారి ఇందుభారతి, సందీప్, వెన్నమల్ల అజయ్, జహేంద్రనాయక్, రమేష్, కిషన్‌నాయక్, గంగాధర్, సుధాకర్, శ్యాం, రవి, నరేష్ , రేష్మ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● మరిపెడ ఎంపీడీవో, తహసీల్ ఆఫీస్, పీహెచ్‌సీలతో వివిధ పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని సామూహికంగ ఆలపించారు. ఆయా కార్యాక్రమాల్లో తహసీల్ధార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

● నర్సింహులపేట, దంతాలపల్లి, కొత్తగూడ, డోర్నకల్ మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

● పెద్దవంగర మండలంలో జరిగిన వందేమాతరం గీతాలపన కార్యక్రమంలో తహసీల్ ఆఫీస్‌లో ఆర్ఐ లష్కర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వేణుమాధవ్, ఎంఈవో కార్యాలయంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● కేసముద్రం మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. శ్రీవివేకర్థిని హైస్కూల్‌లో వందేమాతరం అక్షర రూపంలో విద్యార్థులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ పాల్గొన్నారు.

● కురవి తహసీల్దార్ ఆఫీస్‌లో తహసీల్ధార్ విజయ, డీటీ ఆకుల రవి, ఆర్ఐ రవి సిబ్బంది వందేమాతరం గీతాలాపన చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారి వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కురవి జీపీలో కార్యదర్శి విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఎన్. రాజేందర్‌కుమార్, అవిరే మోహన్‌రావు, తుకారం నాయక్, సీహెచ్. అనిల్, గణేష్, వీరన్న, నాగరాజు, దైద భద్రయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

● తొర్రూరు తహసీల్ ఆఫీస్, మండల పరిషత్ కార్యాలయం, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో వందేమాతరం గీతాలపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● బయ్యారంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజుతో పాటు, సిబ్బంది, పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవి కుమార్, ఎస్సై తిరుపతితో పాటు సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దీపికతో పాటు సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో శాఖాధిపతులు, ఉపాధ్యాయులు వందేమాతరం గీతాన్ని అలపించారు. దీంతో పాటు అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఉపేందర్, నాగరాజు, నర్సయ్య, ఎల్లయ్య, బిక్షపతి, మురళీ, రవి, గణేష్, రమేష్, నరేష్, బాలరాజు, సుధాకర్, రాంబాబు బయ్యారం, గంధంపల్లి గ్రామాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు

● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



ఫ్రెషర్స్ డే వేడుకలో పాల్గొన్న లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. తాను పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఎన్ఐటీ దుర్గాపూర్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశానన్నారు. సివిల్ సర్వీస్-2020లో అల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించానన్నారు. కళాశాలలో ప్రవేశం పొందిన నాటి నుంచే ఏమి సాధించాలనకుంటారో దానిపై దృష్టి సారించి పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. సైబర్ నేరాలు, ర్యాగింగ్ పట్ల తగుజాగ్రత్తలు వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బలరాంనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జనగామకు తరలివెళ్లిన నాయకులు



సీటీఐయూ మహాసభకు తరలివెళుతున్న కార్యకర్తలు

పాలకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా కేంద్రంలో జరిగే సీటీయూ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేసేందుకు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి చిట్యాల సోమన్న మాట్లాడుతూ కార్మిక చట్టాలను తుంగలో తొక్కి, కార్మికుల పొట్టకొడుతుందని ఆవేదన వ్యక్తం తరలివెళ్లిన వారిలో అంబటి సోమయ్య తోట రాజు, సమ్మయ్య, సారయ్య, ఉప్పలయ్య, సంపత్, రాంచంద్రం ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

పాలకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వల్మిడిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేసినట్లు ఎంఈవో పోతుగంటి నర్సయ్య తెలిపారు. శుక్రవారం మాజీ సర్పంచు బీసు లలిత తన సొంత ఖర్చులతో 150 ప్లేట్లను పంపిణీ చేసిన ట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ విద్యుత్ లైన్‌మెన్ బీసు యాదగిరి, ఉపాధ్యాయులు దోకురు రాములు ఉన్నారు.

ఉపాధ్యాయురాలుగా మారిన ఎంపీడీవో

పాలకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో వేదవతి ఉపాధ్యాయురాలుగా మారి కాసేపు విద్యార్థులకు పాఠాలు బోధించారు. శుక్రవారం తీగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలను ఎంపీడీవో వేదవతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఐదో తరగతి పుస్తకం తీసుకొ ని విద్యార్థులతో చదివించింది. అర్థంకాని విషయాలను వారికి వివరించింది. మధ్యాహ్న భోజనం మంచిగా పెడుతున్నారా, ఉపాధ్యాయులు పాఠాలు బాగా చెబుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. గ్రామంలో 76 ఇందిరమ్మ ఇళ్ల మంజూరి అయితే అందులో 34 ఇళ్లకు ముగ్గులు పోసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఆమెవెంట హౌసింగ్ ఏఈ రోహిత్, పంచాయతీ కార్యదర్శి బక్క మహేశ్ ఉన్నారు.

'గుంతల రోడ్లతో ఇబ్బందులు'



రోడ్డుపై పడిన గుంతలను చూపుతున్న ఎంసీపీఐ నాయకులు

కేసముద్రం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి దర్గా వరకు రోడ్డుపై విపరీతమైన గుంతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంసీపీఐ మండల కార్యదర్శి మర్రిపెల్లి మొగిళి అన్నారు. స్థానిక మార్కెట్ రోడ్డులో శుక్రవారం భారీ గుంతలను పరిశీలించిన అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారని అన్నారు. రోడ్డుపై ఈ గుంతలు ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఆయన వెంట పార్టీ మండల కమిటీ సభ్యులు జాటోత్ బిచ్యానాయక్, ఉల్లి ప్రతాప్, బానోత్ సుధాకర్, లింబా, మొగిలి పాల్గొన్నారు.

టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శికి సాయం



ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో వెంకటనారాయణకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

నెహ్రూసెంటర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాకు చెందిన టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి సుతారపు వెంకటనారాయణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో వారికి టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ కొండపల్లి రాంచందర్ రావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బసవతారకం ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. వారికి ఆర్థిక పరిస్థితిని బాగోలేకపోవడంతో చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి రూ. 4 లక్షలను ఆర్థిక సాయం ప్రకటించారు. శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్టు భవనంలో టీడీపీ నేతల సమక్షంలో అందించారు. కార్యక్రమంలో అరవింద్‌గౌడ్, నన్నూరి నర్సిరెడ్డి, పిట్టల రాము పాల్గొన్నారు.

'మూఢనమ్మకాల నిర్మూలనకు జేవీవీ కృషి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందిస్తూ మూఢనమ్మకాల నిర్మూలనకు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) కృషి చేస్తున్నట్లు జేవీవీ జిల్లా బాధ్యుడు మంగపతిరావు అన్నారు. మహబూబాబాద్‌లోని వర్సటైల్ పాఠశాలలో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్-2025 సైన్స్ సంబరాల టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆసక్తిని పెంపొందించే విధంగా ఈ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూవిద్యార్థులకు సైన్స్‌కు సంబంధించిన అంశాలపై టాలెంట్ టెస్ట్ నిర్వహించడం వలన సైన్స్‌పై ఆసక్తి పెంపొంది భావిశాస్త్ర వేత్తలుగా రాణిస్తారని పేర్కొన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 260 పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంల నుంచి 20 వేల మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనడం జరిగిందన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు ఈనెల 21న నిర్వహించనున్న మండలస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఖలీద్‌పాషా, యిమ్మడి సునిత, మాధవి, ఉమా, రహీమా పాల్గొన్నారు.

నిద్రలో నిఘా నేత్రాలు

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్, ఉప్పల్, ఖమ్మం, వరంగల్, నర్సంపేట, తొర్రూరు, మరిపెడ బంగ్లా, సూర్యపేట తదితర ప్రాంతాలకు రోజూ ఆర్టీసీ బస్సులు నడుస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తాయి. వీటికి తోడు వివిధ డిపోల నుంచి మహబూబాబాద్ మీదుగా మంచిర్యాల, భద్రాచలం, కొత్తగూడెం, వేములవాడ, కరీంనగర్, గోదావరిఖని, ఒడిస్సా రాష్ట్రం రాయఘడ్ లాంటి ప్రాంతాలకు బస్సులు నడవడంతో వివిధ పనుల నిమిత్తం ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలకు ఎంతోమంది ప్రయాణిస్తుంటారు. మానుకోట జిల్లా కేంద్రానికి వివిధపనుల నిమత్తం నలుమాలల నుంచి ఇక్కడకు చేరుకుంటారు. ఆయా ప్రాంతాల్లో పని చేస్తే ఉద్యోగులు అప్‌అండ్‌డౌన్ చేస్తూంటారు. ఇలా ప్రతీ రోజు వేలాది మంది మానుకోట బస్టాండ్ ప్రాంగణం నుంచి రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఇక రాష్ట్రప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక పండుగ సమయాల్లో అత్యధికంగా ప్రయాణిస్తూ ఉంటారు.

దోపిడీ ఉన్నంత వరకు ప్రజా ఉద్యమాలు తప్పవు

(5వ పేజీ తరువాయి)

సాధించడమే ఘన నివాళి అని సాదినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఎన్డీ డివిజనల్ నాయకుడు శ్రీశైలం అధ్యక్షతన పాలడుగు కృష్ణ సంస్మరణ సభను ఎన్డీ నాయకులు నిర్వహించారు. ముందు గా కొత్తగూడలో అరుణోదయ కళాకారులు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తుండగా, నాయకులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. సాదినేనితో పాటు పలువురు మాట్లాడారు. సభలో నాయకులు బండారి ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, భూర్క వెంకటన్న, గుజ్జు దేవేందర్, భూర్క బుచ్చిరాములు, సువర్ణపాక పుల్లక్క, వజ్జ సమ్మక్క, ఆగబోయిన నర్సక్క, తాళ్లపల్లి ప్రభాకర్, గుగ్గిళ్ల వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

● టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పోరాటాలతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతున్నాయని టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ పట్టణ 5వ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చదువుల్లో మతోన్మాదాన్ని పెంపొందించే విధంగా ఉందని మండిపడ్డారు. బీజేపీ పాలనలో వివిధ రాష్ట్రాల్లో మహిళలపై హత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కావాలంటే ఎస్ఎఫ్ఐ పోరాటాలతోనే సాధ్యమవుతుందన్నారు. దేశంలో విద్యారంగ సమస్యలు పెరిగిపోయాయని, వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భాష పవన్, నాయకులు గుండ్ల రాకేష్, వంశీ, వరుణ్, తాజ్, సాయి. నవీన్ పాల్గొన్నారు.